సాక్షి అనకాపల్లి

మంగళవారం ၊ 7 ၊ మార్చి ၊ 2023



అర్జీల పరిష్కారానికి..

కలెక్టరేట్ స్పందనకు 180 అర్జీలు వచ్చాయి. వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. 8లో



డాక్టర్ కూటికుప్పలకు అవార్డు

విశాఖ: ప్రముఖ వైద్యుడు కూటికుప్పల సూర్యారావు అంతర్జాతీయ వైద్య శాస్త్రవేత్త అవార్డును వారణాసిలో అందుకున్నారు.



గిరిజనులకు గోవుల అందజేత

సింహాచలం: పలువురు గిరిజనులకు సింహాచలం దేవస్థానం గోశాలలోని దేశవాళీ గోవులను సోమవారం అందజేశారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జోనల్ ఇన్‌చార్జిలు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనుబంధ విభాగాల జోనల్ (అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాల) ఇన్‌ఛార్జిలను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

విభాగాల వారీగా..

యువజన విభాగం-ఎం.సునీల్‌కుమార్ (విశాఖ నార్త్), **రైతువిభాగం**- చిక్కాల రామారావు (పాయకరావుపేట) **బీసీ సెల్**-తుల్లి చంద్రశేఖర్‌యాదవ్ (విశాఖ నార్త్)

వైఎస్సార్‌టీయూసీ- కలిదిండి బద్రినాథ్ (విశాఖ వెస్ట్), **పంచాయతీరాజ్ వింగ్**- బొడెపు గోవింద్ (యలమంచిలి), **ఎస్టీ సెల్**- కిముడు శ్రీనివాస విశ్వ ప్రసాద్ నాయుడు(పాడేరు), **మైనారిటీ సెల్**- బర్కత్ ఆలీ(విశాఖ నార్త్), **విద్యార్థి విభాగం**- బి.కాంతారావు (విశాఖ ఈస్ట్), **వికలాంగుల విభాగం**- ఇమంది వెంకటరమణ(అనకాపల్లి), **వైఎస్సార్‌సేవాదళ్**-సేనాపతి రామ్మూర్తి(నర్సీపట్నం), **డాక్టర్ వింగ్**- నరసింగరావు(పాడేరు), **వాణిజ్యవిభాగం** - నారాయణశెట్టి శ్రీరామ్మూర్తి(విశాఖ ఈస్ట్), **సాంస్కృతిక విభాగం**- వంకాయల మారుతీ ప్రసాద్(భీమిలి), **పబ్లిసిటీ వింగ్**- కంపా హనోక్(విశాఖ నార్త్), **మహిళా విభాగం**- గరికిన గౌరి(విశాఖ సౌత్), **గ్రీవెన్స్ సెల్ విభాగం**- చొక్కాకుల వెంకట్రావ్(పెందుర్తి), **వీవర్స్ వింగ్**- సూరిశెట్టి సూరిబాబు(పెందుర్తి)

వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా కడిశెట్టి సత్యనారాయణ, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా పోతంశెట్టి పోతరాజేష్‌లను నియమించారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఈమేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రేపటి నుంచి మహిళా దినోత్సవ కార్యక్రమాలు



అనకాపల్లి టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ నాగిరెడ్డి చెప్పారు. ఎన్టీఆర్ క్రీడా మైదానం ఆవరణలోని సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 8వ తేదీ నుంచి 25 వరకు వివిధ క్రీడా సాంస్కృతిక, విద్య, వైద్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సంస్థ అధికారి అచ్యుతకుమార్, కోచ్‌లు పాల్గొన్నారు.

తానాం గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

పరవాడ: తానాం బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం అర్హత కలిగిన విద్యార్థినులు ఏప్రిల్ 4 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చునని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు చెప్పారు. బీసీ, ఈబీసీ విద్యార్థినుల వయసు 9 నుంచి 11 ఏళ్లు మించకూడదన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థినుల వయసు 9 నుంచి 13 ఏళ్లు మించి ఉండకూడదని పేర్కొన్నారు. వార్షికాదాయం లక్ష రూపాయల లోపు ఉండాలని, జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వం గుర్తించిన పాఠశాలలో రెండేళ్లు చదివి ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి https://mjpapbcwreis, apcfss. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చునని చెప్పారు.

మహిళల ఆత్మరక్షణకు కరాటే దోహదం



మాట్లాడుతున్న హెచ్‌ఎం సూర్యనారాయణ

మునగపాక: మహిళల ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కాండ్రేగుల సూర్యనారాయణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆత్మరక్షణ కోసం కొత్తగా కోచ్‌లను నియమించింది. దీనిలో భాగంగా మునగపాక మండలం ఉమ్మలాడ గ్రామానికి చెందిన చవల చంద్రశేఖర్ అనకాపల్లి జిల్లాకు ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. సమగ్ర శిక్ష విభాగం ఆధ్వర్యంలో మునగపాక హైస్కూల్లో కరాటే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కోచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక పండగ

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సంస్థ విస్తరణకు హెటెరో ఎంవోయూ
- మరో రూ.రెండు వేల కోట్ల పెట్టుబడులు.. మూడు వేల ఉద్యోగాలు
- సర్వత్రా ఆనందం.. ఆశావహ వాతావరణం

అంతర్జాతీయ స్థాయిలో జరిగిన పెట్టుబడుల పండగతో అనకాపల్లి జిల్లాకు సైతం ప్రయోజనం చేకూరనుంది. ఈనెల 3, 4 తేదీల్లో విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో పాల్గొన్న హెటెరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ వంశీరెడ్డి.. రూ.2 వేల కోట్లతో తమ కార్యకలాపాలను మరింత విస్తరిస్తామని చెప్పారు. కొత్తగా మూడు వేలమందికి ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఆ సంస్థ చేసుకున్న ఒప్పందం జిల్లా నిరుద్యోగులకు తీపి కబురు అందించింది.



సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు

నక్కపల్లి: ప్రముఖ ఫార్మా కంపెనీ హెటెరో గ్రూప్ రాష్ట్రంలో తమ కార్యకలాపాలను మరింత విస్తరించనుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నక్కపల్లి మండలం ఎస్.నర్సాపురం, రాజయ్యపేట సమీపంలో రూ.2500 కోట్ల వ్యయంతో 500 ఎకరాల్లో ఫార్మా కంపెనీ నడుపుతోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 10 వేలమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన విశాఖ సమ్మిట్‌లో పాల్గొన్న కంపెనీ ఎండీ బి.వంశీరెడ్డి రెండు వేల కోట్ల రూపాయలతో విస్తరించనున్నట్టు ప్రకటించడంతో



నక్కపల్లి మండలం రాజయ్యపేట సమీపంలో ఏర్పాటు చేసిన హెటెరో కంపెనీ

సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ పెట్టుబడుల ద్వారా మరో 3 వేలమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. హెటెరో సంస్థకు పరవాడలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో 35 ఎకరాలను ఏపీఐఐసీ గతంలో కేటాయించింది. ఈ స్థలాన్ని కూడా కంపెనీ విస్తరణకు వినియోగించే అవకాశముంది.

వైఎస్ ప్రోత్సాహంతో కంపెనీ ఏర్పాటు

2006వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రోత్సాహంతో నక్కపల్లి మండలం ఎస్.నర్సాపురం, రాజయ్యపేట ప్రాంతాల్లో హెటెరో చైర్మన్ బండి పార్థసారథిరెడ్డి ఫార్మా కంపెనీని నెలకొల్పారు. మొదట 200 ఎకరాల్లో ఏర్పాటయింది. ఇప్పటికి సుమారు 500 ఎకరాల్లో కంపెనీ విస్తరించింది. ఇంతవరకు ఈ కంపెనీ తరపున నక్కపల్లి ప్లాంట్‌లో రూ.2500 కోట్ల పెట్టుబడులు పెట్టారు. వివిధ రకాల మందులతోపాటు బర్డ్ ఫ్లూ, స్వైన్‌ఫ్లూ వంటి అరుదైన వ్యాధులకు సైతం మందులు తయారుచేస్తున్నారు. కోవిడ్ చికిత్సకు వినియోగించిన రెమిడెసివర్ ఇంజక్షన్‌ను కూడా హెటెరో కంపెనీయే అందించింది. స్థానికులతోపాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వందలాది మందికి ఇక్కడ ఉద్యోగాలు లభించాయి. స్కిల్డ్, అన్‌స్కిల్డ్ లేబర్‌తోపాటు భవన నిర్మాణ కార్మికులు, రోజువారీ కూలీలు ఎంతోమంది ఈ కంపెనీపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇక్కడ పరిశ్రమను ఏర్పాటు చేయడం వల్ల వలసలు బాగా తగ్గాయి.

80 ఎకరాలు కేటాయించిన జగన్ సర్కారు

కంపెనీ విస్తరణకు రెండేళ్ల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు మార్కెట్ ధరకు సుమారు 80 ఎకరాలు భూమిని కేటాయించింది. దీంతో యాజమాన్యం దశలవారీగా ఏటా రూ.100 కోట్ల నుంచి 200 కోట్ల పెట్టుబడులు పెడుతూ కంపెనీని విస్తరిస్తోంది. తాజాగా జీఐఎస్‌లో ఎండీ వంశీరెడ్డి చేసిన ప్రకటనతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి.

సేవా కార్యక్రమాల్లో ముందంజ

కంపెనీ యాజమాన్యం ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 2015 నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.27 కోట్ల సీఎస్ఆర్ నిధులతో విద్య, వైద్యరంగాలకు సహాయ సహకారాలు అందించింది. నక్కపల్లి మండలంలో రూ.2 కోట్ల వ్యయంతో 16 ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసింది. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన బెంచీలు, మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్లు, ప్రహరీ గోడల నిర్మాణం, పుస్తకాలు, ప్లేట్లు, స్టడీ మెటీరియల్ అందజేయడంతోపాటు, అదనపు తరగతి గదులు నిర్మించింది. పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు, వీధి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. నక్కపల్లిలో కంటి ఆస్పత్రి ఏర్పాటు చేసి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తూ కళ్లద్దాలు పంపిణీ చేస్తోంది. జిల్లాలో 700మంది టీబీ రోగులకు ప్రతి నెలా రూ.20 లక్షలు వెచ్చించి పోషకాహారం సరఫరా చేస్తోంది. కంపెనీ పరిసర గ్రామాల్లో మొబైల్ వ్యాన్ ద్వారా వైద్య సేవలు అందించేందుకు ఏటా రూ.35 లక్షలు ఖర్చు చేస్తోంది. కరోనా విపత్తు సమయంలో రూ.2 కోట్ల విలువైన నిత్యావసర సరుకులు, కూరగాయలు, హైపోక్లోరైట్ ద్రావణం, శానిటైజర్లు అందజేసింది.

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతోనే..



ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సహకరిస్తోంది. అవసరమైన సదుపాయాలు కల్పిస్తోంది. రానున్న రెండేళ్లలో మరో రెండు వేల కోట్ల రూపాయల పెట్టుబడితో సంస్థను విస్తరించడానికి ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకున్నాం. దీని ద్వారా మరో 3 వేలమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. సీఎస్ఆర్ పథకం కింద మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. **-బి.వంశీరెడ్డి,** హెటెరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 111 కేంద్రాల్లో నిర్వహణ.. సీసీ కెమెరాల ఏర్పాటు
- వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష



తుమ్మపాల: టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చెప్పారు. కలెక్టరేట్‌లో సోమవారం విద్యాశాఖాధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 111 కేంద్రాల్లో ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలకు 22,232 మంది రెగ్యులర్, 1,681 మంది ప్రైవేటు విద్యార్థులు, మొత్తం 23,913 మంది హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని, ఈ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేంద్రం 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. స్క్వాడ్‌ను రెవెన్యూ, పోలీస్, విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ శాఖ బందోబస్తు ఏర్పాట్లను పటిష్టం చేయాలని పేర్కొన్నారు. స్పాట్ వాల్యుయేషన్ పూర్తయ్యే వరకు స్ట్రాంగ్‌రూమ్ అయిన జీవీఎంసీ బీఆర్ అంబేడ్కర్ హైస్కూల్ వద్ద పోలీస్ బందోబస్తు ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, డీఎంహెచ్‌వో హేమంత్, విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణమూర్తి, ఆర్డీసీ అధికారులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వెంకన్న తోట ఉత్సవం



తోటలో మండపం వద్ద స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణం అనంతరం ఉభయ నాంచారులతో కూడిన వైకుంఠనాథుని వనవిహార యాత్ర (తోట ఉత్సవం) సోమవారం సాయంత్రం నేత్రపర్వంగా జరిగింది. ఈ ఉత్సవాన్ని భక్తులు స్వామివారి హనీమూన్‌గా చెప్పుకుంటుంటారు. ప్రతి ఏటా వార్షిక కల్యాణం అనంతరం స్వామివారి తోట ఉత్సవం నిర్వహిస్తారు. ఉపమాక శివారు సారిపల్లిపాలెం సమీపంలో గల తోటలో ఉన్న మండపం వద్ద ఈ కార్యక్రమాన్ని ఆలయ ప్రధానార్చకులు జి.వరప్రసాద్ ఘనంగా నిర్వహించారు. రాజాధిరాజ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవేంకటేశ్వరస్వామిని ఉంచి మండపం వద్దకు తీసుకొచ్చారు. విష్వక్సేన తదితర పూజాదికాలు, విశేష హోమాలు జరిగాయి. రాత్రి గజవాహనంపై స్వామివారి తిరువీధిసేవ నిర్వహించారు. తోట ఉత్సవానికి వెళ్తున్న స్వామి వెంట వందలాదిమంది భక్తులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, శ్రీనివాసాచార్యులు, గోపాలాచార్యులు, నరసింహాచార్యులు పాల్గొన్నారు.

తలనీలాల ఆదాయం రూ. 10.76 కోట్లు

- అప్పన్నకు భక్తులు సమర్పించే తలనీలాల వేలం
- గత ఏడాది కంటే రూ.1.49 కోట్లు అధికం



అప్పన్న రాజగోపురం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి భక్తులు సమర్పించే తలనీలాల ద్వారా రూ.10 కోట్ల 76 లక్షల 89వేల 100 ఆదాయం లభించింది. దేవస్థానం చరిత్రలో తలనీలాల ద్వారా ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం రావడం ఇదే తొలిసారి. వివరాల్లోకి వెళ్తే... ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి వచ్చే సంవత్సరం మార్చి 31 వరకు స్వామివారికి భక్తులు సమర్పించే తలనీలాలను విక్రయం జరిపేందుకు సోమవారం దేవస్థానం పరిపాలన కార్యాలయంలో బహిరంగ వేలం, సీల్డ్‌టెండర్, ఈప్రొక్యూర్‌మెంట్ నిర్వహించారు. చెన్నైకి చెందిన దొరై ఎంటర్‌ప్రైజస్, ఏలూరుకి చెందిన ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్, సూర్యోదయ ఎంటర్‌ప్రైజస్, సికింద్రాబాద్‌కి చెందిన నాగకుమారి ఎంటర్‌ప్రైజస్, తిరుపతికి చెందిన గరుడ ఎంటర్‌ప్రైజస్ ప్రతినిధులు వేలంలో పాల్గొన్నారు. తొలుత బహిరంగ వేలం నిర్వహించగా చెన్నైకి చెందిన దొరై ఎంటర్‌ప్రైజస్ 9 కోట్ల 52 లక్షలకు హెచ్చుపాట పాడింది. అనంతరం సీల్డ్ టెండర్లు తెరవగా అందులో కూడా అదే సంస్థ రూ.10కోట్ల 76 లక్షల 89వేల100 హెచ్చుమొత్తానికి కోట్ చేసింది. అనంతరం సాయంత్రం దేవస్థానం అధికారులు ఈ ప్రొక్యూర్‌మెంట్‌ని పరిశీలించగా అందులో రూ.10కోట్ల 66లక్షల 5వేల హెచ్చుమొత్తానికి ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ కోట్ చేసింది. మూడు ప్రక్రియల్లో సీల్డ్ టెండరు ద్వారా చెన్నైకి చెందిన దొరై ఎంటర్‌ప్రైజస్ కోట్ చేసిన హెచ్చుమొత్తాన్ని అధికారులు పరిగణలోకి తీసుకుని ఆమోదం కోసం దేవదాయశాఖ కమిషనర్‌కు పంపించారు. కాగా గత ఏడాది తలనీలాల ద్వారా రూ.9 కోట్ల 27లక్షలు ఆదాయం లభించింది. దీంతో ఈ ఏడాది అదనంగా మరో రూ.కోటి 49 లక్షల 89వేల 100 ఆదాయం లభించింది.

పగలు సెగలు.. రాత్రిళ్లు వణుకు!

- కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతల మధ్య నాలుగు రెట్ల వ్యత్యాసం
- ఉమ్మడి విశాఖలో కనిష్టం 10 డిగ్రీలు.. గరిష్ట ఉష్ణోగ్రత 39 డిగ్రీల నమోదు
- సీజన్ మార్పు వల్లే అంటున్న నిపుణులు



వేసవి తాపం నుంచి గొడుగుతో రక్షణ



ఉదయం ఏజెన్సీలో పొగమంచు

సాక్షి, విశాఖపట్నం : పగలు సెగలు.. రాత్రి వేళ వణుకు.. కొద్ది రోజుల నుంచి ఉమ్మడి విశాఖ జిల్లా వాసులకు ఇలాంటి అనుభూతే కలుగుతోంది. శీతాకాలం వెళ్లిపోయినా ఇప్పటికీ రాత్రి పూట చలి గజగజ లాడిస్తోంది. అంతేకాదు పగటి, రాత్రి ఉష్ణోగ్రతల మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటోంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో కనిష్ట (రాత్రి) ఉష్ణోగ్రతలకంటే గరిష్ట (పగటి) ఉష్ణోగ్రతలు దాదాపు నాలుగు రెట్ల అధికంగా ఉంటూ ప్రజానీకాన్ని ఒకింత ఆశ్చర్య చకితులను చేస్తోంది. కొద్ది రోజుల నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాలో పలుచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు 9-10 డిగ్రీలు నమోదవుతున్నాయి. అదే జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు పైగా రికార్డవుతున్నాయి. అనకాపల్లి జిల్లాలోనూ పరిస్థితి అలాగే ఉంది. కనిష్ట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలు, గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల వరకు ఎగబాకుతున్నాయి. ఇక విశాఖపట్నం జిల్లాలో రాత్రి ఉష్ణోగ్రతలు 16, పగటి ఉష్ణోగ్రతలు 38 వరకు నమోదవుతున్నాయి. అంటే వీటి మధ్య వ్యత్యాసం గరిష్టంగా 24 డిగ్రీల వరకు ఉంటోందన్న మాట! ఉదాహరణకు సోమవారం నాటి ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే.. ఏఎస్సార్ జిల్లాలోని హుకుంపేట 10, జీకేవీధిలో 10.2, చింతపల్లి 10.4, అరకు 10.6, పాడేరు 10.7, జి.మాడుగుల10.8 డిగ్రీలు, అనకాపల్లి జిల్లాలోని మాడుగులలో 14.8, మాకవరపాలెం 15.4, నక్కపల్లిలో 15.6, గొలుగొండలో 15.7, అనకాపల్లి 16.9, నర్సీపట్నంలో 17.9 డిగ్రీలు, విశాఖ జిల్లా పెందుర్తిలో 16.3, భీమిలి 17.9, ఆనందపురం 18, విశాఖ ఎయిర్‌పోర్టులో 19 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఇక గరిష్ట ఉష్ణోగ్రతల విషయానికొస్తే ఏఎస్సార్ జిల్లాలోని పాడేరులో 36, జీకే వీధి 33.2, చింతపల్లి 32.8, హుకుంపేట 32 డిగ్రీలు, అనకాపల్లి జిల్లాలోని మాకవరపాలెంలో 39, అనకాపల్లి 38.4, రోలుగుంట, మునగపాక, సబ్బవరం, పరవాడ, కె.కోటపాడు, గొలుగొండల్లో 38, నక్కపల్లిలో 37 డిగ్రీల చొప్పున రికార్డయ్యాయి. ఫలితంగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 2-4 డిగ్రీలు అధికంగాను, కనిష్ట ఉష్ణోగ్రతలు 2-5 డిగ్రీలు తక్కువగాను నమోదవుతున్నాయి. దీంతో వాతావరణం మధ్యాహ్నం సమయంలో మండు వేసవిని, రాత్రి వేళ శీతాకాలాన్ని తలపిస్తోంది. ఇలా మార్చి ఆరంభంలోనే పగలు వివిధ పనులపై బయటకు వెళ్లే వారు వేసవి తాపాన్ని చవి చూస్తున్నారు. ఇళ్లలో ఉంటున్న వారు ఫ్యాన్లు, ఏసీలను తప్పనిసరిగా వినియోగిస్తున్నారు. రాత్రి పూట చలి కాలంలో మాదిరిగానే దుప్పట్లు, రగ్గులను కప్పుకుని నిద్రిస్తున్నారు. అంతేకాదు.. రాత్రి పొద్దుపోయాక రోడ్లపై ప్రయాణించే వారు వణికిపోతూ కనిపిస్తున్నారు. వీరు చలి నుంచి ఉపశమనం పొందడానికి మఫ్లర్లు, స్కార్ఫ్‌లు వంటివి ధరిస్తున్నారు.

సీజన్ మారే వేళ

శీతాకాలం నుంచి వేసవికాలంలోకి సీజను మారే సమయంలో ఇలాంటి వాతావరణ మార్పు చోటు చేసుకుంటుందని వాతావరణ అధికారులు చెబుతున్నారు. ఇలాంటి సమయంలో గాలిలో తేమ శాతం తగ్గుతుందని, పగటి ఉష్ణోగ్రతలు పెరిగి, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం అధికారి ఒకరు 'సాక్షి'కి చెప్పారు. అందువల్లే పగటి వేళ వేసవి తాపం, రాత్రి సమయంలో శీతల వాతావరణంతో చలి ప్రభావం చూపుతాయని వివరించారు. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని, ఆ తర్వాత సాధారణ స్థితికి చేరుకుంటుందని తెలిపారు.

ఫార్మా రంగంలో మహిళా వికాసం

మహిళా దినోత్సవంలో రాంకీ ఎండీ లాల్‌కృష్ణ



ప్రతిభ కనబర్చిన మహిళలకు పురస్కారాలు అందజేస్తున్న మహిళ స్టడీస్ డైరెక్టర్ ఉష, రాంకీ ఎండీ లాల్‌కృష్ణ

పరవాడ: మహిళలు ఫార్మా రంగంలో దూసుకుపోతున్నారని రాంకీ ఫౌండేషన్ ఎండీ డాక్టర్ పి.పి.లాల్‌కృష్ణ అన్నారు. ఫార్మా సిటీ రాంకీ కమర్షియల్ హబ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఫార్మాసిటీలో సుమారు 9 వేల మంది మహిళలు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వీరు కోవిడ్ సమయంలో అందించిన సేవలు అమోఘమని ప్రశంసించారు. వేడుకలను మూడు రోజులపాటు నిర్వహించనున్నట్టు తెలిపారు. సెంటర్ ఫర్ మహిళా స్టడీస్ డైరెక్టర్ ఉష మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందుతున్న తరుణంలో కూడా మహిళలపై వేధింపులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవడానికి మహిళలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. జెనిత్ ఇంజినీరింగ్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ వి.సంధ్య మాట్లాడుతూ మహిళలు భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ సందర్భంగా ఫార్మా పరిశ్రమలో విశేష ప్రతిభ కనబరిచిన పలువురు మహిళలను సత్కరించి రాంకీ మహిళా సాధికారిత పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్, శ్రీనివాస్, మ్యాక్స్ అధ్యక్షురాలు రాజేశ్వరి, ఫార్మా ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యకల్యాణం.. పచ్చతోరణం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కల్యాణం నిర్వహించారు.

అనకాపల్లి స్టేషన్‌లో సకల సదుపాయాలు

రైల్వే మంత్రికి ఎంపీ సత్యవతి ధన్యవాదాలు



సాక్షి, అనకాపల్లి: 'అమృత్ భారత్ పథకం'లో భాగంగా అనకాపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తున్న కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు ఎంపీ డాక్టర్ సత్యవతి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనకాపల్లి స్టేషన్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తాను ఇచ్చిన వినతిని మన్నించినందుకు రైల్వే శాఖ మంత్రికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు రూ.10 కోట్ల నుంచి రూ.30 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తారని చెప్పారు. ప్రయాణికులు కూర్చోవడానికి వీలుగా బెంచీలు, తాగునీటి సదుపాయం, పార్కింగ్ సదుపాయం, పచ్చదనం- పరిశుభ్రత, లిఫ్టు, ఎస్కలేటర్లు, ఫుడ్ కోర్ట్, మొబైల్ బుక్ స్టాల్స్‌తోపాటు స్థానిక హస్త కళా ఉత్పత్తుల విక్రయాలు, ప్రయాణికులకు అదనపు వెయిటింగ్ హాలు వంటి సదుపాయాలను అందించనున్నారు.

నేడు బీఎన్ రోడ్డులో వాహనాల మళ్లింపు

బుచ్చెయ్యపేట : వడ్డాది వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా చివరి రోజైన మంగళ వారం లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశముం డటంతో బీఎన్ రోడ్డులో వాహనాల మళ్లింపు చేప డుతున్నట్లు బుచ్చెయ్యపేట ఎస్ఐ కుమారస్వామి తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి వరకు రావికమతం నుంచి చోడవ రం, పాడేరు, విశాఖ వెళ్లే వాహనాలు బంగారుమెట్ట ఆంజనేయస్వామి గుడి ప్రక్క నుంచి పోతనపూడి, వీరవల్లి మీదుగా వడ్డాది నాలుగురోడ్ల జంక్షన్‌కు చేరుకునేలా ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా వాహనాల మళ్లింపునకు ఆయా గ్రామాల వాహనదార్లు, ఉద్యోగులు, భక్తులు సహకరించాల్సిందిగా కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమి సాలి

జిల్లా ఎస్పీ గౌతమి సాలి

అనకాపల్లిటౌన్ : చట్టపరిధిలో సమస్యల పరిష్కా రానికి చర్యలు చేపడతానని జిల్లా ఎస్పీ గౌతమిసాలి అన్నారు. తన కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో 35 అర్జీలు స్వీక రించినట్లు చెప్పారు. అర్జీదారుల సమస్యలపై జిల్లా పోలీస్ అధికారులతో మాట్లాడి, వాటి సత్వర పరిష్కారానికి కృషి చేయనున్నట్టు తెలిపారు.

అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు



అర్జీతో బాధితురాలు ఎ.లక్ష్మీచైతన్య



కలెక్టర్‌కు అర్జీ సమర్పిస్తున్న వీరనాగేంద్ర తల్లి మరియమ్మ

తుమ్మపాల : స్పందనలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌కు అర్జీదారులు భారీగా తరలివచ్చారు. తమ సమస్యల్ని కలెక్టర్‌కు నివేదించుకున్నారు. అర్జీ దారుల సమస్యల పట్ల సత్వరం స్పందించి, వాటి పరిష్కారానికి పకడ్బందీగా చర్యలు చేపడుతున్నట్టు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనకు 180 అర్జీలు స్వీక రించినట్లు చెప్పారు. చిన్న సమస్యలపై జిల్లాలో పలు మండలాల నుంచి కలెక్టరేట్‌కు రాకుండా ఆయా మండలాల్లోనే వారి సమస్యలు పరిష్కారా నికి నోచుకునేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్ర మంలో జేసీ కల్పనాకుమారి, డీఆర్వో పి.వెంకటర మణ పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణలపై అర్జీ

ఆవఖండం సర్వే నెం.38/1లో కొంతమంది ఆక్రమ ణదారులు జిరాయితీ భూమిని ఆనుకుని ఉన్న రోడ్డును క్రమేపీ ఆక్రమిస్తున్నారని, దీంతో దారి ఇరుకై పోతోంది. దీనిపై ప్రశ్నిస్తే తమ భూమేనని చెప్తున్నారని ఎ.లక్ష్మీచైతన్య స్పందనలో అర్జీ సమ ర్పించారు.

నిందితులను అరెస్టు చేయాలి

పాయకరావుపేట మండలం పీఎల్‌పురం గ్రామానికి చెందిన దళితుడు వడ్లమూరి వీరనాగేంద్రను హత్య చేసి రోజులు గడుస్తున్నా నిందితులను అదుపులోకి తీసుకోలేదంటూ డీపీఎంసీ సభ్యుడు రేబాక మధుబాబు ఆధ్వర్యంలో వీరనాగేంద్ర తల్లి మరియమ్మ స్పందనలో ఫిర్యాదు చేశారు.

గత నెల 28న కాళ్లు, చేతులు కట్టి హత్య చేసి, బావిలో పడేసిన ఘటనతో గ్రామంలోని దళితులు భయపడుతున్నారని, హ త్య చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని మధుబాబు కోరారు.

రంగురాళ్ల తవ్వకాల్లో ఇద్దరి అరెస్టు

నర్సీపట్నం : కరక రంగురాళ్ల క్వారీలో తవ్వకాలకు యత్నించిన ఇద్దరు వ్యక్తులను ఫారెస్టు అధికారులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. గొలుగొండ మండలం కరక రంగురాళ్ల ప్రాంతాన్ని అటవీ అధికారులు నిషేధిత ప్రదేశంగా పరిగణిం చారు. ఈ రంగురాళ్ల క్వారీ వద్ద బేస్ క్యాంపుతో పాటు మొబైల్ టీమ్ నిత్యం పర్యవేక్షిస్తోంది. అయిన ప్పటికీ అటవీ అధికారుల కళ్లుగప్పి తవ్వకాలు జరి పేందుకు నర్సీపట్నంకు చెందిన ఇద్దరు వ్యక్తులు క్వారీ ప్రాంతంలోకి చొరబడ్డారు. నిషేధిత ప్రాంతం లోకి చొరబడిన నర్సీపట్నం, కాపు వీధికి చెందిన పెదిరెడ్ల జనార్దన్(42), గొలుగొండ మండలం, గుం డుపాల గ్రామానికి చెందిన వై.గణేష్(23)ను రేంజర్ పి.లక్ష్మీనర్సు అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో తవ్వకాలకు జరిపేందుకు వచ్చినట్టు అంగీకరించడంతో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరి చారు. న్యాయమూర్తి ఇద్దరికి 15 రోజులు రిమాండ్ విధించారు.వీ రిని సబ్‌జైలుకు తరలిం చారు. రంగురాళ్ల తవ్వ కాలకు యత్నించిన సం ఘటనపై మరింత లోతుగా విచారణ చేస్తు న్నామని రేంజర్ తెలిపారు.



నిందితులు

ఉరేసుకుని వృద్ధుడి మృతి

నాతవరం : నర్సీపట్నం, తుని మధ్య పెడిమికొండ అటవీప్రాంతం జీడి తోటలో చెట్టుకు ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది నట్టు నాతవరం ఎస్ఐ డి.లక్ష్మినారా యణ తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. తాండవ జం క్షన్ సమీపంలో వై.డి.పేట రెవెన్యూ పరిధిలో లాలం అచ్చియ్యమ్మకు చెందిన జీడితోటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం చెట్టుకు వేలా డుతూ ఉన్నట్లు స్థానికులు సమా చారం ఇచ్చారు. సిబ్బందితో వెళ్లి తోటలో చెట్టుకు వేలాడుతున్న మృ తదేహాన్ని పరిశీలించి సమీప గ్రామాలకు సమాచారమిచ్చారు. ఆచూకీ తెలి యకపోవడంతో మృతదేహన్ని అధి కారుల అదేశాల మేరకు నర్సీప ట్నం ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడికి సుమారు 60 ఏళ్ల వయ సుంటుందని, ఎత్తు 5.6 అడుగులు, చామన చాయ రంగు కలిగి, ఆకు పచ్చ నెక్ బనియన్ వేసుకుని ఉన్నట్టు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఉరి వేసుకుని చనిపోయి ఉం డవచ్చని భావిస్తున్నట్టు తెలిపారు. ఆచూకీ కోసం నాతవరం పోలీసు స్టేషన్‌కు 8332970770, 08932 287633 సంప్రదించాలన్నారు.



జీడి చెట్టుకు వేలాడుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృదేహం

భార్యను హతమార్చిన భర్త అరెస్టు

గూడెంకొత్తవీధి: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వ లేదని కట్టుకున్న భార్యనే నాటు తుపాకీతో కాల్చి చంపిన భర్తను సోమవారం గూడెంకొత్తవీధి పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్ విలేకరులకు వివరించారు. ఈ నెల 2న గూడెంకొత్త వీధి మండలం మొండిగెడ్డ పంచాయతీ గాలిమాను వీధికి చెందిన గబులంగి రామచంద్రరావు(42) మద్యానికి డబ్బులు ఇవ్వలేదన్న కారణంతో ఆగ్రహానికి గురై ఇంటిలో నిద్రిస్తున్న తన భార్య విజ యలక్ష్మిని నాటుతుపాకీతో కాల్చాడు. ఈ ఘటనలో ఆమె కుడి తొడపై తీవ్ర రక్తస్రావమై ఆమె మరణిం చింది. మద్యానికి బానిసైన రామచంద్రరావు తరచూ తన భార్యను వేధించేవాడు. సంఘటన జరి గిన రోజు కూడా కాఫీ గింజలు అమ్మగా వచ్చిన డబ్బులు తనకు ఇవ్వలేదన్న కారణంతో ఆమెపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపి, ఆమె మరణా నికి కారకుడైనట్టు సీఐ తెలిపారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌శివకిషోర్ ఆదేశా లమేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టా మన్నారు. ఈ ఘటనకు పాల్పడి పరారయ్యేందుకు ప్రయత్నిస్తున్న రామచంద్రరావును సోమవారం ముల్లుమెట్ట వద్ద పట్టుకున్నట్టు వెల్లడించారు. నింది తుడి నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకు న్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై అప్పల సూరి, సిబ్బంది పాల్గొన్నారు.



అరెస్టయిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న నాటు తుపాకీతో సీఐ అశోక్‌కుమార్, ఎస్సై అప్పలసూరి

దేవవరం ఎంపీటీసీ ఉప ఎన్నికకు సన్నాహాలు

పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా విడుదల



పోలింగ్ స్టేషన్ల వివరాలు



పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీవో

నక్కపల్లి : మండలం లోని దేవవరం ఎం పీటీసీ ఉప ఎన్నికల ప్రక్రియ ఊపందుకుం ది. సోమవారం ఈ సెగ్మెంట్‌లో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాలను అధికారులు విడుదల చేశారు. ఎంపీడీవో కార్యా లయంతోపాటు, దేవవరం పంచాయతీ కార్యాలయంలో వీటిని ప్రదర్శించారు. పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలుంటే తెలియజే యాలని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. గతంలో జరిగిన ఎన్నికల్లో దేవవరం ఎంపీటీసీగా వైఎస్సార్‌సీపీ తరఫున గొర్ల రాఘవకుమారి గెలుపొందారు. అంతకు ముందు జరిగిన సర్పం చ్ ఎన్నికల్లో రాఘవకుమారి సర్పంచ్‌గా విజయం సాధించారు. రెండు పదవుల్లో ఒక దానికి రాజీనామా చేయాల్సి రావడంతో ఆమె ఎంపీటీసీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహించాల్సి వచ్చింది. గత నెలలో ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటించారు. ఇపుడు పోలింగ్ బూత్‌ల వివరాలు కూడా నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచినట్టు ఎంపీడీవో తెలి పారు. త్వరలోనే దేవవరం ఎంపిటీసీ ఉపఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. అధికారుల సన్నాహాలతో గ్రామంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రభుత్వం ఏర్ప డిన మూడేళ్ల తర్వాత జరుగుతున్న ఉప ఎన్నికలు అందులోను పార్టీ గుర్తుపై జరగనుండటంతో ప్రతిపక్ష టీడీపీ సైతం ఇక్కడ పోటీపై ఆలోచన ప్రారంభించింది.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో సత్తా చాటిన హరిణిశ్రీ

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బాలికల విభాగంలో ప్రథమ స్థానం



చోడవరం రూరల్ : అనకాపల్లి జిల్లా చోడవరం మండలం ఖండేపల్లికి చెందిన పోతుల హరిణిశ్రీ సైనిక్ స్కూల్ ఆలిండియా ర్యాంకుతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని బాలికల విభాగంలో ఫస్ట్ ర్యాంకును సాధించి తన సత్తా చాటింది. మం డల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న హరిణిశ్రీ సైనిక్ ప్రవేశ పరీ క్షలో 300 మార్కులకు గాను 273 మార్కులను సాధించింది. ఆలిండియా స్థాయిలో 332వ ర్యాంకు, బాలికల విభాగంలో 28వ స్థానంలో నిలిచింది. నేష నల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన ఈ పరీక్షలో హరిణిశ్రీ భాషా విభాగంలో 48(50), గణితం 141(150), సాధారణ పరి జ్ఞానం 36(50), విజ్ఞానం 48(50) మార్కులను సాధిం చినట్లు పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు పి.అప్పల నాయుడు తెలిపారు. ఆంధ్రప్ర దేశ్ రాష్ట్రానికి సంబంధించి పదో ర్యాంకులో నిల వగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని బాలికల విభాగం లో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. పోతుల అప్పలనాయుడు, ప్రగతిల కుమార్తె హరిణిశ్రీ ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఇంతటి ప్రతిభ చూపడంపట్ల పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ దాడి మహాలక్ష్మినాయుడు, గ్రామ సర్పంచ్ శానాపతి రాజశేఖర్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కలర్‌ఫుల్ పండగకు రెడీ



వసంత కాలంలో వచ్చే రంగుల హోలీ.. జీవితం లో నింపేనే సంతోష కేళీ.. అంటూ రంగుల పం డగ సంబరాలకు విశాఖ సిద్ధమవుతోంది. హోలీ రంగులు జల్లుకునేందుకు సరికొత్త వస్తువులు మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. పిల్లలను ఆక ర్షించేలా బ్యాక్‌ప్యాక్ గన్స్, ఏకే 47, మిసైల్స్ రూపంలో కలర్‌ఫుల్ రంగుల కోసం విభిన్నమైన ప్రొడక్ట్స్ అందుబాటులోకి వచ్చాయని అక్కయ్య పాలెం మెయిన్‌రోడ్డులోని న్యూషాప్ ఓనర్ వెంక టేష్ చెబుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్

విశాఖ సిటీలో దాస్ కా దమ్కీ యూనిట్



విలేకరుల సమావేశంలో చిత్ర యూనిట్

అల్లిపురం: ఉగాది కానుకగా ఈ నెల 22న దాస్ కా దమ్కీ చిత్రం విడుదల చేస్తున్నట్లు చిత్ర దర్శకుడు, వర్ధమాన నటుడు విశ్వక్ సేన్ తెలిపారు. చిత్రం ప్రమోషన్‌లో భాగంగా చిత్ర యూనిట్ సోమవారం సాయంత్రం జగదాంబ థియేటర్‌లో సందడి చేసింది. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ తన స్వీయ దర్శకత్వంలో రూపొందు తున్న ఈ చిత్రం అన్ని వర్గాల వారిని అలరిస్తుందన్నారు. విభిన్న అంశాలతో అద్భుత మైన కథ కావడంతో తానే దర్శకత్వం బాధ్యతలు చేపట్టానన్నారు. సినీ రంగంలో దాస్ కా ధమ్కీ సరికొత్త రికార్డులను సృష్టిస్తుందని విశ్వక్ సేన్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీ తాన్ని లియోన్ జేమ్స్ చేకూర్చారన్నారు. ఇప్పటికే విడుదల చేసిన రెండు పాటలు యూట్యూబ్‌ని షేక్ చేస్తున్నాయన్నారు. ప్రేక్షకులు తమ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. కథానాయికగా నివేదా పేతురాజ్, రావు రమేష్, రోహిణి, హైపర్ ఆది, అజయ్, తరుణ్ భాస్కర్, అప్పరగౌడ్ కీలక పాత్రలు పోషించారని వివరించారు.

అగ్ని ప్రమాదంలో జీడితోట దగ్ధం

రోలుగుంట: మండలంలోని లగుడు కొత్తూరులో సోమవారం సాయంత్రం లగుడు వారి భూముల వద్దనున్న జీడి తోటలో అగ్ని ప్రమాదం సంభ వించింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన లగుడు అప్ప లనాయుడు జీడి తోట రెండెక రాల విస్తీర్ణంలో దగ్ధమయింది. ఐతే ఈ ప్రమాదం ఎలా జరిగిం దో తెలియరాలేదు. బాధితుడు అప్పలనాయుడికి ఎవరితోనూ శతృత్వం లేదని, తోవన పోయేవారు సిగరెట్టు కాల్చి పడే యడంతో ఎండిన ఆకుల్లో పడి మంటలు రేగి ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థాని కులు చెప్తున్నారు. తనకు జరిగిన నష్టంపై బాధితుడు విలపిస్తూ, ప్రభుత్వం నుంచి నష్టప రిహారం కోసం తహసీల్దార్‌ను ఆశ్రయించనున్నట్టు తెలిపాడు.



లగుడు కొత్తూరులో అగ్ని ప్రమాదంలో దగ్ధమైన జీడితోట

ఆకట్టుకుంటున్న ఆహ్వాన నాటిక పోటీలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం గ్రామంలో పారిప ల్లెమ్మ పండగను పురస్కరించుకుని గత రెండు రోజులుగా నిర్వహి స్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ఆకట్టు కుంటున్నాయి. సోమవారం రాత్రి మూడు నాటిక ప్రదర్శనలు ఇచ్చారు. కరీంనగర్ వారి చీకటి పువ్వు, చిలకలూరిపేట వారి నాన్నా.. నేనొచ్చేస్తా, విశాఖపట్నం వారి ఇది కథ కాదు నాటి కలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మూడవ నాటికలో భోగస్ చిట్ ఫండ్ కం పెనీల గురించి కళ్లకు కట్టినట్లు చూపించారు.



నాటికలోని ఒక దృశ్యం

స్పందన ఫిర్యాదులను మూడు రోజుల్లో పరిష్కరించాలి

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ) : ఓపెన్ డ్రైన్‌లు మర మ్మతులు చేపట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిని అరిక ట్టాలని జీవీఎంసీ స్పందనలో పలువురు ఫిర్యాదులు చేశారు. జీవీఎంసీ కమిషనర్ పి. రాజాబాబు ఆదేశాల మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. వీటిలో ప్రధానంగా టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జోన్-4 పరిధి సిరిపురంలో అనధికార కట్టడాలు ఎక్కువైయ్యాయని రావాడ అప్పలనాయుడు, వేంక టేశ్వరమెట్ట ప్రాంతంలో అక్రమ కట్టడాలు జరుగు తున్నాయని కమల్‌కిషోర్, జోన్-5 పరిధి అక్కయ్య పాలెం జగన్నాథపురంలో అక్రమ నిర్మాణాలపై గూడూరు పెంటారావు ఫిర్యాదు చేశారు. జోన్-4 పరిధి భానోజీనగర్‌లో ఓపెన్ డ్రైన్‌లు మరమ్మతులు చేపట్టాలని ఎస్. పియూష్ ఫిర్యాదు చేశారు. జోన్-3 పరిధి రాజేంద్రనగర్ నుంచి తిప్పాన రాం బాబు ప్రాపర్టీ ట్యాక్స్‌కు సంబంధించి ఫిర్యాదు చేశారు. జోన్-1 నుంచి ఒకటి, జోన్-2 నుంచి మూడు, జోన్-3 నుంచి 16, జోన్-4 నుంచి ఎనిమి ది, జోన్-5 నుంచి పది, జోన్-6 నుంచి పది, జోన్-8 నుంచి ఆరు, జీవీఎంసీ ప్రధాన కార్యాల యానికి సంబంధించి ఒక ఫిర్యాదు వచ్చింది. మొత్తంగా అందిన 55 ఫిర్యాదుల్లో పరిపాలన అండ్ అకౌంట్స్ విభాగానికి 1, రెవెన్యూకి 6, ప్రజారోగ్యా నికి 4, పట్టణ ప్రణాళికా విభాగానికి 26, ఇంజినీరిం గ్ అండ్ హార్టీకల్చర్‌కు 14, యూసీడీకి 4 ఫిర్యాదులు వచ్చాయి. వీటిని పరిశీలించి 3 రోజుల్లో పరిష్కరిం చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.స న్యాసిరావు, పట్టణ ప్రణాళికా అధికారి బి.సురేష్‌కు మార్, సెక్రటరీ పి. నల్లనయ్య, హార్టీకల్చర్ డీడీ దామోదరరావు, డీసీ (రెవెన్యూ) ఫణిరాం, రీజనల్ ఫైర్ ఆఫీసర్ సీహెచ్ కృపానందం, డీపీవో చంద్రిక, డీసీపీలు, ఏసీపీలు, డీఈవో శ్రీనివాసరావు, యూసీడీ పీవో సూర్యకళ, పర్యవేక్షక ఇంజినీర్లు, యూసీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ

ప్రతిభకు వేదిక

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): సాంస్కృతిక, సంప్రదాయా లతో పాటు నగర వాసుల ప్రతిభను ప్రదర్శించేందుకు వేదిక ఓ చక్కటి అవకాశమని జీవీఎంసీ అదనపు కమిష నర్ సన్యాసిరావు అన్నారు. వేదిక పేరుతో నిర్వహిస్తున్న వైజాగ్ టాలెంట్ హంట్ కార్యక్రమం సోమవారం ఉత్సా హంగా సాగింది. ఈ కార్యక్రమానికి నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోందని సన్యాసిరావు తెలిపారు. ఇప్పటి వరకు 400 రిజిస్ట్రేషన్లు జరిగాయని, రోజుకు 30 నుంచి 50 ప్రదర్శనలు జరుగుతున్నాయ న్నారు. క్లాసికల్, వెస్టర్న్, కర్రసాము, గిటారు మ్యూజిక్ వంటి ప్రదర్శనలు అద్భుతంగా సాగాయి.



ప్రదర్శనలతో అలరిలరిస్తున్న కళాకారులు

క్లుప్తంగా

హ్యాపీకిడ్స్‌లో ముందస్తు హోలీ వేడుకలు



రంగులు జల్లుకొని కేరింతలు కొడుతున్న చిన్నారులు

అనకాపల్లిటౌన్ : కులమతాలకు అతీతంగా భారతీయులందరూ ఒక్కటై జరుపునే పండగ హోలీ అని హ్యాపీకిడ్స్ ప్లేస్కూల్ కరస్పాండెంట్ శెట్టి గిరీష్‌కుమార్ అన్నారు. స్థానిక ఉడ్‌పేట స్కూల్ ఆవరణలో హోలీ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. రసాయనాలు కలవని, ప్రకృతి ప్రసాదించిన పూలు, ఆకుల ద్వారా లభించే సహజరంగులను నీటిలో కలిపి చిన్నారులు జల్లుకొని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో ఇంటింటి కుళాయి పనులు



దుర్గాలమ్మపేటలో కుళాయి పనులు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలోని దుర్గాలమ్మపేటలో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు పనులు చురుగ్గా సాగుతున్నాయి. జల్ జీవన్ మిషన్ కింద తాళ్లపాలెం గ్రామంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ప్రస్తుతం 3వ వార్డులోని దుర్గాలమ్మపేటలో భూగర్భంలో పైప్‌లైన్ వేసి ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తున్నారు. ఈ నెలాఖరుకు కనెక్షన్లు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నారు. పనులను ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ సోమవారం పరిశీలించారు.

పోలిపల్లెమ్మ అమ్మవారి పండగ నేడు

మునగపాక : గవర్ల అనకాపల్లిలో మంగళవారం పోలిపల్లెమ్మ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఏటా మార్చి మొదటి వారంలో నిర్వహించే ఉత్సవంలో భాగంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అదే రోజు రాత్రి పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

అనకాపల్లి సినిమాలు

గ్రంథాలయం	రాజా
కోనసీమ	సత్యనారాయణ-1
సాచి	సత్యనారాయణస్క్రీన్-2
వినరోభాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు	వెంకటేశ్వర
బిగ్‌స్నేక్ కింగ్	శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	రామచంద్ర

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 9,146 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,520	4,000
మొదటి రకం	3,420	3,690
రెండో రకం	3,140	3,490
మూడో రకం	3,040	3,120

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 44 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-21 యూనిట్లు, ఓ పాజిటివ్ 12 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 251 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 318 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

భోజనమా... సరకులా..!



పల్లపువీధి కేంద్రంలో సర్వే చేస్తున్న సూపర్‌వైజర్



అనకాపల్లి పట్టణంలోని కోట్ని వీధి అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న గర్భిణులు



సర్వే పత్రంలోని ప్రశ్నలు

- గర్భిణులు, బాలింతల మనోగతంపై పూర్తయిన సర్వే
- నాలుగు అంశాలపై అభిప్రాయాలు సేకరించిన యంత్రాంగం
- ఇంటికే సరకులు ఇవ్వాలని కోరుతున్న లబ్ధిదారులు

అనకాపల్లి : ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణిలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోంది. దీనివలన శిశుమరణాలు తగ్గడమే కాకుండా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటున్నారు. కరోనా వైరస్ రాక ముందు వీరందరికీ అంగన్‌వాడీ కేంద్రాల్లో వేడి వేడిగా పౌష్టికాహారం వండి పెట్టేవారు. కరోనా ప్రభావంతో తల్లులు,పిల్లలకు డ్రై రేషన్(సరకులు) ఇంటికే అందించేవారు.టేక్ హోం రేషన్ సరుకులు ఇళ్లకు అందించడం వలన గర్భిణిలు,బాలింతలకు ఇస్తున్న ఆహారం దుర్వినియోగం అవుతుందన్న ఉద్దేశ్యంతో గతేడాది జూన్ నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం వండి అందిస్తున్నారు.ఈ విధానంపై లబ్ధిదారులు పూర్తిస్థాయిలో ఆసక్తి చూపకపోవడంతో క్రమంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి భోజనం చేసే వారి సంఖ్య తగ్గిపోతోంది. దీంతో ప్రభుత్వం కొన్ని వెసులుబాట్లు కల్పించింది. నెలలు నిండడం,ఆరోగ్య సమస్యలు ఉన్న వారు, చిన్నారుల సంరక్షణ చూసుకోవడం తదితర సమస్యలతో కేంద్రాలకు రాలేనివారికి పోషకాహారం ఇంటికి తీసుకెళ్లేందుకు అవకాశం కల్పించారు. అయినా లబ్ధిదారుల్లో మార్పు లేకపోవడంతో ఇటీవల సర్వే చేపట్టారు. గర్భిణులు సక్రమంగా పోషకాహారం తీసుకోకపోవడంవల్ల పిల్లలు లోపాలతో పుడుతున్నారని సర్వేలు చెబుతున్నాయి. దీంతో తాజా సర్వే చేపట్టినట్టు అధికార యంత్రాంగం తెలిపింది. అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం తినడానికి, అంగన్‌వాడీ కేంద్రం నుంచి లంచ్ బాక్స్ ఇంటికి తీసుకెళ్తారా? మధ్యాహ్న భోజనం సరకులు ఇంటికి తీసుకెళ్తారా? అన్న అభిప్రాయాలను లబ్ధిదారుల నుంచి సేకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపట్టిన ఈ సర్వే వివరాలను క్షేత్ర స్థాయి సిబ్బంది ఆన్‌లైన్‌లో పొందుపరిచారు.

ఇంటికే సరకులు కావాలి : సర్వే ప్రకారం దాదాపు అందరూ డ్రై రేషన్ కావాలని కోరినట్టు తెలిసింది. కేంద్రాలకు వెళ్లడం ఇబ్బందిగా ఉందని ఇంటికే సరకులిస్తే బాగుంటుందని మెజార్టీ లబ్ధిదారులు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచినట్టు అధికారవర్గాల సమాచారం.ముఖ్యంగా విశ్రాంతి తీసుకోవాల్సిన మధ్యాహ్న సమయంలో కేంద్రాలకు రావడం ఇబ్బందిగా ఉంటోందని పలువురు గర్భిణులు అభిప్రాయపడినట్టు తెలిసింది. అనకాపల్లి అర్బన్‌లో 74, కశింకోట ప్రాజెక్టు పరిధిలో 91 కేంద్రాలున్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల పరిధిలో 1623 మంది గర్భిణులు, 1617 మంది బాలింతలు, 11209మంది చిన్నారులు ఉన్నారు.

కేంద్రంలో ఒక నెలకు అందించే ఆహారం(ఒక్కొక్కరికి) ఇలా..	
బియ్యం	3 కిలోలు
నూనె	500 గ్రాములు
కందిపప్పు	కిలో
అటుకులు	కిలో
జొన్నపిండి	కిలో
ఖర్జూరం	250గ్రాములు
పాలు	5 లీటర్లు
గుడ్లు	25
రాగిపిండి	కిలో

కారణాలు తెలుసుకున్నాం



గర్భిణులు,బాలింతలు కేంద్రాలకు వచ్చి భోజనం చేస్తేనే మంచిదన్న విషయంపై పలుమార్లు అవగాహన కల్పించాం. అయినా చాలా మంది రావడానికి ఇష్టపడడం లేదు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. చేపట్టిన సర్వే ఫలితాలు నేరుగా ఉన్నతాధికారులకే చేరాయి. ఏ పద్ధతి అనుసరించాలో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఆమేరకు తదుపరి చర్యలుంటాయి.

– పి ప్రభావతి, సీడీపీవో, అనకాపల్లి

ఇళ్ల లబ్ధిదారులకు విద్యుత్ కనెక్షన్లు

కశింకోట: కశింకోట గ్రామంలో వైఎస్సార్ జగనన్న ఇళ్ల నిర్మాణ లే-అవుట్లలో గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు విద్యుత్ కనెక్షన్, రీడింగ్ మీటర్ ఇవ్వనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకోసం ఇళ్ల స్థల పట్టా, ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీలతో అగ్రహారం వీధిలోని తమ సెక్షన్ కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. సొంత స్థలంలో హౌసింగ్ రుణంతో గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులు కూడా విద్యుత్ కనెక్షన్ పొందడం కోసం సత్వరమే ఆధార్ కార్డు జెరాక్స్ కాపీతో కశింకోట విద్యుత్ లైన్‌మన్‌ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామిని దర్శించుకుంటున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, స్థానిక నేతలు

అనకాపల్లి రూరల్ : తుమ్మపాల మేజర్ పంచాయతీలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో మూడో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి మూలవర్లకు పాలు, పెరుగు, తేనె, పంచామృతం నారికేళ జలాలతో అభిషేకాలు చేశారు. పుష్పాలతో విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. స్వామివారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నేతలు,ఉత్సవ కమిటీ సభ్యులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేక మంది భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం, పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కోలాటాలు,చెక్క భజనలు అలరించాయి.

మహిళలకు ఉచిత కుట్టుమిషన్ తరగతులు

అనకాపల్లిటౌన్: మహిళల ఆర్థికాభివృద్ధి, ఉపాధికి ఉచిత కుట్టుమిషన్ తరగతులు దోహదపడతాయని జన శిక్షణా సంస్థాన్(జెఎస్ఎస్)చైర్మన్ సి.వి. రామరాజు అన్నారు. స్థానిక గౌరీ గ్రంథాలయంలో జన శిక్షణ సంస్థాన్ సహకారంతో ఉచిత కుట్టుమిషన్ తరగతులు సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలను స్వయం ఉపాధి రంగంలో ప్రోత్సహించేందుకు ఉచితకుట్టు శిక్షణ కాలంలో కావాల్సిన స్టేషనరీ, మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. ఏదో ఒక రంగంలో నైపుణ్యం ఉంటేనే ఉపాధి దక్కుతుందన్నారు. శిక్షణలో నైపుణ్యం సాధించిన మహిళలకు సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. ఈ సర్టిఫికెట్ల ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో భవిష్యత్‌లో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కోస్టల్‌బ్యాంకు అధిపతి టి.మురళీమోహన్ మాట్లాడుతూ శిక్షణ అనంతరం ఉపాధి కల్పనలో భాగంగా అర్హులకు కుట్టుమిషన్లు కొనుగోలుకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, కోశాధికారి భీశెట్టి కృష్ణ అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

‘విజన్ బిల్డింగ్’పై మహిళలకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం తిలక్

కశింకోట : సరైన దిశ, నైపుణ్యం కలిగిన కలలు కంటూ ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి మహిళలు కృషి చేయాలని ఏపీఎం బి.డి. తిలక్ కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ ఆధ్వర్యంలో విజన్ బిల్డింగ్ (కలల నిర్మాణం)పై మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవంలో మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు సామర్థ్యాన్ని, జవాబుదారి తనాన్ని పెంపొందించుకోవాలన్నారు. సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తూ అసమానతలు అధిగమించడానికి కృషి చేయాలన్నారు. మెరుగైన జీవనోపాధి మార్గాలు అనుసరించి దీర్ఘకాలిక భవిష్యత్‌ను, ఉన్నత శిఖరాలు అందుకోవాలన్నారు. శిక్షణలో ఇచ్చే మెలకువలను పాటించి భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలన్నారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాండ్రపు అరుణ, కార్యదర్శి అప్పలనరసమ్మ, ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు, సీసీలు పాల్గొన్నారు.

మత్తు జోలికి పోవద్దు

- విద్యార్థులకు సెబ్ ఎస్ఐ గణేష్ సూచనలు
- నార్కోటిక్ చట్టంపై అవగాహన



విద్యార్థులకు డ్రగ్స్ దుష్ప్రభావాల గురించి వివరిస్తున్న సెబ్ ఎస్ఐ గణేష్

యలమంచిలి : ప్రాణాంతక డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాల జోలికి పోకుండా విద్యార్థులు సన్మార్గంలో నడవాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) ఎస్ఐ కె.ఎస్ గణేష్ అన్నారు. సోమవారం యలమంచిలి స్టేషన్ రోడ్డులో గీతాంజలి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, హషిష్, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాల గురించి వివరించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కృషి చేస్తోందని, సమాజంలో యువతా మేలుకో-భవితను మలుచుకో-డ్రగ్స్‌ను వదులుకో అనే నినాదంతో మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, కళాశాలల్లో యువతీ,యువకులకు ఉద్బోధించడం జరుగుతోందని అన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు వినియోగించినా, కలిగి ఉన్నా, విక్రయించినా, అటువంటి కార్యకలాపాలకు ప్రోత్సహించినా నార్కోటిక్స్ చట్టం ప్రకారం 6 నెలల నుంచి 20 సంవత్సరాలు వరకు కఠిన జైలు శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఎవరైనా ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు తెలిస్తే 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. డ్రగ్స్‌ను సేవించడం ద్వారా, శారీరక రుగ్మతలు, వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న వారిలో యుక్తవయసు వారే అధికమని అన్నారు. విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి ఉన్నత విద్యను అభ్యసించి సన్మార్గంలో నడుచుకోవాలని అన్నారు.

తమలపాకు తోటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న హార్టికల్చర్ అధికారిణి ఉమామహేశ్వరి

పాయకరావుపేట : తమలపాకు పంటలను పండించే రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల ఉద్యానవనశాఖాధికారి సిహెచ్.ఉమామహేశ్వరి అన్నారు. సత్యవరం గ్రామంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. తమలపాకు తోటలకు సోకుతున్న ఆకుకుళ్ళు, మొదలుకుళ్ళు, ఆకుమచ్చ, కాండంగజ్జి తెగులు, నత్తలు, గొంగళి పురుగులు ద్వారా సంక్రమించే తెగుళ్లను ఎదుర్కోవడానికి రైతులు తీసుకోవాలని జాగ్రత్తలు, ఉపయోగించవలసిన పురుగు మందులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏపి తెగుళ్లకు ఏపి పురుగు మందులు పిచికారీ చేయాలో రైతులకు అవగాహన కల్పించారు.

ఆ గ్రామాల్లో మరోసారి భూ సర్వే

రావికమతం : మండలంలో తొలి దశలో భూ రీసర్వే జరిగిన 11 గ్రామాలలో తప్పొప్పులను సరిచేస్తూ మరోసారి సర్వే ప్రారంభించాల్సిందిగా సర్వే, రెవెన్యూ సిబ్బందికి తహసీల్దార్ మహేశ్వర రావు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రత్యేక సమీక్షలో ఆయన మాట్లాడారు. మండలంలోని చినపాచిల, మత్స్యపురం, మచ్చవానిపాలెం, గుమ్మాళ్లపాడు, పెదపాచిల, జెడ్.కొత్తపట్నం, దిడ్డి, కానాడ, రావికమతం, గర్నికం, కొమిర గ్రామాలలో తొలివిడత రీసర్వే పూర్తయ్యిందన్నారు. అయితే సిబ్బంది తొందరపాటు వలన కొంత మంది రైతుల నుంచి అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు. రైతుల భూ విస్తీర్ణంలో లోపాలు, ఆధార్ తదితర వివరాల తప్పుడు నమోదు, బ్యాంకు ఖాతాల నమోదులో తప్పులు దొర్లడంతో కొంత మంది రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. వాటిని పరిష్కరించాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం నుంచే రీసర్వే మరలా ప్రారంభించినట్టు వెల్లడించారు. ఇకపై తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని హెచ్చరించారు.

‘ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు విజయం తథ్యం’



బ్యాంకులో ప్రచారం చేస్తున్న జానకీరామరాజు, రమేష్ నేతలు



మండలంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ నేతలు



82వ వార్డులో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సునీత, జానకీరామరాజు, పార్టీ నేతలు

అనకాపల్లిటౌన్ : వైఎస్సార్‌సీపీ మద్దతుతో పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ విజయం తథ్యమని పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ అన్నారు. పట్టణంలో బ్యాంకులతోపాటు పోస్టాఫీసులో సోమవారం స్థానిక నేతలతో కలిసి వారు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. జగనన్న సంక్షేమ పాలనకు మద్దతుగా పట్టభద్రులంతా సుధాకర్‌కు మొట్టమొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఉగ్గిన అప్పారావు, బొండా శంకరరావు, కుండల రామకృష్ణ, కోన ఉమ, సత్తిబాబు, కన్నబాబు, కల్యాణ్, బొండా వాసు, అచ్యుతరావు, దివాకర్ పాల్గొన్నారు.

అధికారపార్టీ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం...

అధికారపార్టీ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో మారేడుపూడి, అక్కిరెడ్డిపాలెం, గోపాలపురం, గొలగాం, భట్లపూడి, శంకరం, రేబాక, కోడూరు సచివాలయాల పరిధిలో గల ప్రాథమిక పాఠశాలలో పట్టభద్రులను కలిసి ఆయన వైఎస్సార్‌సీపీ మద్దతుతో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఓటు వేసి అత్యధిక మెజార్టీతో విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సాలాపు కనకరాజు, జెర్రిపోతుల లక్ష్మి, నారపిన్ని ప్రసాద్, గొంతిన సత్యారావు, సత్యవతి, నర్సింగరావు, పసుపులేటి లక్ష్మి, రాపేటి నాగేశ్వరరావు, మాటూరు సన్యాసమ్మ, సేనాపతి లక్ష్మి, ఎంపీటీసీలు రాము నాయుడు, అప్పలనాయుడు, మంత్రి సంతోషం, సత్తిబాబు, అచ్చియ్యమ్మ, మజ్జి వెంకట అప్పారావు, రామ్‌శంకర్ పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : వైఎస్సార్‌సీపీ మద్దతుతో పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ విజయం ఖాయమని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. వార్డు పరిధిలో సోమవారం ఆమె స్థానిక పార్టీ నేతలతో కలిసి ఆమె ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి పాలనకు మద్దతుగా మొట్టమొదటి ప్రాధాన్యత ఓటు వేసి పట్టభద్రులంతా సుధాకర్ విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పట్టణ అధికార ప్రతినిధి నాగేశ్వరరావు, సత్యనారాయణ, కుండల రామకృష్ణ పాల్గొన్నారు.

స్వామి వివేకానంద ఆశయ సాధనకు కృషి



ఆనందస్వామికి వంటపాత్ర అందిస్తున్న నాగభూషణం

అనకాపల్లిటౌన్ : స్వామి వివేకానంద ఆశయసాధనకు అనుగుణంగా సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ పని చేస్తుందని సంస్థ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం అన్నారు. యలమంచిలి మండలం కొక్కిరాపల్లి ప్రేమసమాజం నిర్వాహకుడు ఆనందస్వామికి నున్న వీరభద్రరావు జ్ఞాపకార్థం సంస్థ కార్యాలయంలో సోమవారం సైకిల్, వంటపాత్రలు, పిల్లల ఆటవస్తువులు, వంట సామాగ్రి, వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో వీరభద్రరావు కుమారుడు మణికంఠ, కుమార్తె సౌజన్య, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి వార్షికోత్సవానికి ఏర్పాట్లు

ఎస్.రాయవరం: అడ్డురోడ్డులో మంగళవారం అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేశారు. జంక్షన్‌లో నాలుగు రోడ్లు వైపు భారీ విద్యుత్ సెట్టింగ్‌లు ఆకర్షణీయంగా అమర్చారు. ఉదయం స్వామికి సింధూర తమలపాకు పూజలతో పాటు, అభిషేకాలకు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

నేత్రపర్వంగా వెంకన్న గరుడోత్సవం



స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు, ఆలయ అధికారులు



ఆకట్టుకున్న కోలాటాలు



తప్పెటగుళ్లు

అనకాపల్లిటౌన్ : స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గరుడోత్సవం నేత్రపర్వంగా జరిగింది. స్వామివారి భక్తబృందం సభ్యులు స్వామివారిని గజమాలలతో అలంకరించారు. స్వామివారిని పురవీధులగుండా ఊరేగించారు. కడిమిశెట్టి ప్రసాద్ ఇంటి వద్ద చోర సంవాదం, అన్నమాచార్య వాగ్గేయ వారదాయిని బృందం సంకీర్తనలు, కోలాటాలు, కాగడాలు, చిడతలు, తప్పెటగుళ్లు, మంగళ వాయిద్యాలు ఊరేగింపులో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఆదినారాయణ, ఆలయ అధికారులు రమాబాయి, ఆలయ అర్చకులు గిరిబాబు, విజయబాబు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశిమాంబ విగ్రహ ప్రతిష్ట



పరదేశిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : రామారాయుడుపేటలో సోమవారం పరదేశిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి నాగప్పారావు, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడుతోపాటు కమిటీ సభ్యులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

ఆకట్టుకున్న ‘ద్రోణా 23’



ఫెస్ట్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ‘ద్రోణ 23’ పేరిట నిర్వహించిన ఎన్‌సీసీ ఫెస్ట్‌లో విద్యార్థులు అద్భుతమైన విన్యాసాలు ప్రదర్శించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎలా వ్యవహరించాలి..?, అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కమాండింగ్ అధికారి కల్నల్ తాపస్ మండల్ ఈ సందర్భంగా ఎన్‌సీసీ గురించి పలు విషయాలు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ ధర్మిరెడ్డి ప్రసాద్, ఎన్‌సీసీ అధికారులు, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.